క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

కార్మిక పక్షపాతి రమేష్



రమేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పరవాడ: సీఐటీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్.రమేష్ 6వ వర్ధంతిని పరవాడలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, పలువురు నాయకులు రమేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రమేష్ కార్మిక పక్షపాతి అని కొనియాడారు. విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాలకు ఆకర్షితుడై ఉద్యమ బాట పట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెన్నల లక్ష్మి, సన్యాసమ్మ, అక్కులమ్మ, ఐద్వా నాయకులు పి.మాణిక్యం, అల్లు రాజు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే కావాలి



మాట్లాడుతున్న రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, బొడ్డేద తదితరులు



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు

- 'జగనన్న ఆరోగ్య సురక్ష' దేశానికే రోల్ మోడల్
- సామాజిక సాధికార బస్సు యాత్రతో ప్రజలకు మరింత చేరువ
- టీడీపీ–జనసేన కుయుక్తులను ప్రజలకు వివరించాలి
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

పెందుర్తి: సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెట్టాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధి జెట్ స్పీడ్‌లో ఉంటుందని చెప్పారు. సబ్బవరం మండల కేంద్రంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర సన్నాహక సమావేశం మంగళవారం వేపగుంట సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుబ్బారెడ్డి నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ఎస్సీలు, బీసీలు, మైనార్టీలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వివరించాలన్న ఉద్దేశంతోనే ఈ బస్సు యాత్ర చేపట్టామన్నారు. ఎస్సీలు, బీసీలు, మైనారిటీలు, గిరిజనులను సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు ఎన్నో పథకాలు అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిస్తున్న నాయకుడు అని చెప్పారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడానికి సీఎం వైఎస్ జగన్ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. దీనిలో భాగంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నా రు. రానున్న రోజుల్లో మండల, వార్డు స్థాయిలో ప్రతీ నెలా నిరంతరాయంగా శిబిరాలు కొనసాగించాలని సీఎం యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారన్నారు.

9 నుంచి మళ్లీ జగనే ఎందుకు కావాలి

గురువారం నుంచి ప్రారంభం కానున్న 'మళ్లీ జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమగ్రంగా వివరించాలని చెప్పారు. సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే, కో ఆర్డినేటర్, మండల, గ్రామ స్థాయి నాయకులు సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

దొంగ ఓట్లపై దృష్టి పెట్టండి

క్షేత్రస్థాయిలో దొంగ ఓట్ల ఏరివేతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. గత ఎన్నికల ముందు చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ అన్ని నియోజకవర్గాల్లో దొంగ ఓట్లు చేర్పించి అడ్డదారిలో గెలవాలని చూసిందన్నారు. కానీ ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అలాంటి అడ్డదార్లు తొక్కే అవసరం లేదన్నారు. అందుకే ఎక్కడ దొంగ ఓటు కనిపించినా ఏరివేసేందుకు మొహమాటం పడొద్దని ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా దీటుగా ఎదుర్కొని వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. త్వరలో సబ్బవరంలో జరగనున్న బస్సు యాత్రతో ప్రతిపక్షాల వెన్నులో వణుకుపుట్టాలని చెప్పారు.

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక బస్సు యాత్ర విజయవంతానికి అందరూ సహకరించాలని చెప్పారు. టీడీపీ, జనసేనకు పదవుల పాకులాట తప్పా జనం గురించి పట్టదని ఎద్దేవా చేశారు. పార్టీ క్యాడర్ అంతా ఏకతాటిపై నిలబడి రానున్న ఎన్నికల్లో మళ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా సగర్వంగా ఎగిరేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, నియోజకవర్గ ఓటర్ల జాబితా సవరణ ఇన్‌చార్జి కొటాన రాము, నియోజవకర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ మధుపాడ నాగమణి, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బట్టు సూర్యకుమారి, పరవాడ జెడ్పీటీసీ రాజు, ఏఎంసీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, ఎస్‌ఎంఎంఎస్ డైరెక్టర్ నదీయా, పార్టీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు మనాలత జోబ్‌దాస్(చిన్నీ), బోకం రాము నాయుడు, సబ్బవరపు ముత్యాలనాయుడు, ఉప్పిలి కనకరాజు, చుక్కా రామునాయుడు, ఇల్లపు ప్రసాద్, కాళ్ల గంగాధర్, బొప్పా నాగరాజు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, ఆదిరెడ్డి మురళి, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, చందుయాదవ్, మెంటి మహేష్, యతిరాజుల నాగేశ్వరరావు, వరంబాబు, కిల్లి అప్పారావు, సురేష్‌రాజ్, గొరపల్లి శ్రీను, దాడి అర్జున, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం

ఉపాధి పథకం విజిలెన్స్ కమిషనర్ డీవీ మల్లికార్జున



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున

సబ్బవరం: ఉపాధి పనుల గుర్తింపు, నిర్వహణలో సాగునీటి వనరుల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధి పథకం విజిలెన్స్ కమిషనర్ డీవీ మల్లికార్జున సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీవో రమేష్ నాయుడు అధ్యక్షతన సబ్బవరం, యలమంచిలి, చోడవరం, కె. కోటపాడు. పెందుర్తి మండలాల ఉపాధి పథకం అధికారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఉపాధి పనుల నిర్వహణకు నల్లరేగులపాలెం, నారపాడు, బంగారమ్మపాలెం. గ్రామాల్లో గుర్తించిన రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో మినీ సర్క్యులేషన్ ట్యాంక్లు, ఫారం ఫాండ్, బౌండ్రీ ట్రెంచ్ పనులు చేపట్టేందుకు కొండవాలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా విస్తృతంగా నిర్వహిస్తున్న చెరువులు, కాలువ పనులకు ప్రాధాన్యం తగ్గించి మిగతా 96 రకాల పనులు గుర్తించి, సకాలంలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఇప్పటి వరకూ జరిగిన ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీలు మణికుమార్, శ్రీనివాస్, అంజనేయులు, ఏపీవోలు శ్రీనివాసరావు, అప్పలరాజు, ఈఏలు పరమేష్ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

డీఎస్ఎన్ఎల్ యూ ప్రొఫెసర్ విజయలక్ష్మి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయలక్ష్మి

సబ్బవరం: మహిళలు, బాలికలు తమ హక్కులు, వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మేహాద్రిగెడ్డలోని గురుకుల పాఠశాలలో మంగళవారం డీఎస్ఎన్ఎల్‌యూలోని సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా ఆధ్వర్యంలో మహిళలు, బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నేడు మహిళలు అనేక రకాల హింసలకు గురవుతున్నారన్నారు. చట్టాల పట్ల సరైన అవగాహన లేక రక్షణ పొందలేకపోతున్నారన్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు వల్ల ఆడబిడ్డలకు తల్లిదండ్రులు సరైన విద్య అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలుసుకోలేక చేస్తున్న పనులతో చిన్నారులు బాల్యాన్ని కోల్పోవడమే గాక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహల నిరోధక చట్టం 2006 రూపొందించి చిన్నారుల భవిష్యత్తును కాపాడే దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు చేస్తే కఠినమైన శిక్షలే కాకుండా భారీ జరిమానాలు ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగం మహిళలు, శిశువుల రక్షణకు ఆర్టికల్ 14,15,16 రూపొందించిందన్నారు. వరకట్న నిషేధ చట్టం 1961 ద్వారా మహిళలు రక్షణ పొందవచ్చని వివరించారు. ఇండియన్ పీనల్ కోడ్ 198ఎ, 3040, గృహ హింస నిరోధక చట్టం 2005 వంటి చట్టాలు మహిళలకు రక్షణ కలిస్తాయని వివరించారు. సమాన వేతన చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, విద్యాహక్కు చట్టం, ఫోక్సో చట్టం గురించి విద్యార్థినులకు వివరించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎస్ భాగ్యలక్ష్మి, పలువురు విద్యార్థినులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపు కోసం సైనికుల్లా పనిచేద్దాం

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం సైనికుల్లా పని చేద్దామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. వెన్నలపాలెంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ సంక్షేమ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పలువురితో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని నాయకులకు సూచించారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో దోపిడీకి పాల్పడితే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తుందన్నారు. ఇంటి స్థలాలు, అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, పంటల బీమా, విద్యా కానుక, వైఎస్సార్ చేయూత, జగనన్న గోరుముద్ద లాంటి పథకాలతో ప్రతి ఇంట చిరు నవ్వులు చిందుతున్నాయన్నారు. సంక్షేమ పాలన సాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, ఎంపీటీసీ వెన్నల అరుణకుమారి, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు పైల అప్పలనాయుడు, గొర్లి గోపి, పైల రేగారావు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ



దిశ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

సబ్బవరం: దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్‌పై అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు సబ్బవరం పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పలు చోట్ల ప్రజలతో మమేకమై దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు దిశ యాప్ ఎంతో అవసరం అన్నారు. ప్రతి విద్యార్థి, మహిళ రక్షణ కోసం తమ తమ స్మార్ట్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. దిశ యాప్ వల్ల మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్లల్లో బాణసంచా రవాణా నిషేధం



విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం : దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌లో ప్రత్యేక డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టింది. రైళ్లలో దీపావళి సామగ్రి తరలించకూడదని, మండే స్వభావం గల పదార్థాలు తరలించకూడదని విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగాలో రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించింది. డివిజన్ పరిధి లోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్ లలో రైల్వే అధికారులు, సివిల్ డిఫెన్స్ సభ్యు లు, రైల్వే భద్రతా దళం సిబ్బంది రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు వీటిపై అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా రైళ్లలో, రైల్వేస్టేషన్‌లలో టపాసు లు, మండే ప్రమాదకర పదార్థాలు రవాణా చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ఘనంగా ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం



సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ సిన్హాకు కేక్ తినిపిస్తున్న అధికారులు

పరవాడ: ఎన్టీపీసీ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సంస్థ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. అనంతరం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 48 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 73,874 ఎండబ్ల్యూ సాధించిందని వివరించారు. రానున్న సంవత్సరంలో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కొత్త శక్తితో కష్టపడి పనిచేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ వివిధ రంగాల్లో సాధించిన అవార్డులు, ప్రశంసలను వివరించారు. వేడుకల్లో భాగంగా హిందీ పక్వాడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్.గోవిందరాజన్, అంజూ సిన్హా, హెచ్‌ఆర్ హెడ్ రుమా డీ శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి.కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో దీపిక లేడీస్ క్లబ్ సహకారంతో మూడు నెలల పాటు బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ముగిశాయి. శిక్షణ పూర్తి చేసిన 25 మందికి దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ద్వారా వ్యక్తులకు సాధికారిత అందించడమే లక్ష్యమన్నారు సమాజంలో స్వీయ విశ్వాసం, వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడానికి ఎన్టీపీసీ అంకితభావంతో కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ రుమాడీశర్మ, సీఎస్సార్ విభాగం ప్రతినిధి ప్రకాశరావు, శివప్రతాప్‌సింగ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్

పెందుర్తి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ నిబంధనలు పాటించాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ పాఠశాలలో మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విద్యార్థులు వివరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. నిబంధనలు పాటించకపోవడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ జి.రమేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన సునీల్

పెందుర్తి: నాయుడుతోటకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాలివి..నాయుడుతోట సమీపంలోని వెంకటసాయినగర్‌లో మల్లి సునీల్, నిర్మల దంపతులు నివాసం ఉంటున్నారు. సునీల్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సునీల్ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెచ్‌సీ ప్రకాష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాంపురం బైపాస్‌పై రెండు లారీల ఢీ

డ్రైవర్లకు గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన లారీలు

పెందుర్తి: పెందుర్తి మండలం రాంపురం సమీపంలోని అనకాపల్లి–ఆనందపురం బైపాస్ సర్వీస్ రోడ్డులో మంగళవారం రెండు లారీలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి.. విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలోని బొగ్గు యార్డు నుంచి పరవాడలోని హిందుజా కంపెనీకి బొగ్గు లోడుతో వెళుతున్న లారీ రాంపురం వంతెన వద్దకు వచ్చేసరికి సబ్బ వరం నుంచి పెందుర్తి వైపు కంకర లోడుతో వెళుతున్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు లారీల క్యాబిన్లు నుజ్జయ్యాయి. బొగ్గు లారీ డ్రైవర్ జానీ కాలుకు తీవ్ర గాయమైంది. టిప్పర్ లారీ డ్రైవర్‌కు నుదిటిపై తీవ్ర గాయమైంది. క్షతగాత్రుల ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పెందుర్తి సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి 'అర్హులందరికీ సంక్షేమం'

- ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: మండలంలో ఈ నెల 9వ తేదీ నుంచి అర్హులందరికీ సంక్షేమం కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేసిందో, ఆ పథకాలకు అర్హత ఉన్నా అందుకోలేకపోతున్న వారి గురించి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి సచివాలయంలో ఈనెల 9 నుంచి ఒకరోజు సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆయా సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల ఉద్యోగులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలి విడత పది గ్రామ సచివాలయాల పరిధిలో కార్యాచరణ రూపొందించినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్ని శాఖల అధికారులకు పిలుపునిచ్చారు.

కృత్రిమ దీవులతో మత్స్య సంపద పెరుగుదల

పరవాడ: సముద్రంలో తరగిపోతున్న మత్స్య సంపదను పెంపొందించుకునే విధంగా గంగపుత్రులు ముందుకు రావాలని కృత్రిమ (సీఎంఎఫ్‌ఆర్ఐ) దీవుల శాస్త్రవేత్త డాక్టర్ శోభాజోయ్ కిజ హకుడన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ముత్యాలమ్మపాలెంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. కృత్రిమ దీవుల ఏర్పాటు వాటి ఉపయోగాలను వివరించారు. మత్స్యశాఖ డీ జాష్మిన్, ఎఫ్‌డీవో రవిజేజ, ఎంపీటీసీ అరిజిల్లి దేవి రవి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రజల సంపద

ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని మోదీ ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు మెయిన్ గేటు వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మానవహారం నిర్వహించారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు మద్దతు ఇస్తున్న మోదీ వైఖరిని పోరాట కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఉక్కు దీక్షలు 1000 రోజులకు చేరుకుంటున్న సందర్భంగా బుధవారం ఉదయం కూర్మన్నపాలెం కూడలిలో జరిగే దీక్షలో కుటుంబాలు వేలాదిగా పాల్గోవాలని పిలుపునిచ్చారు.

గంజాయి నిందితుడికి రిమాండ్

సీతమ్మధార: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కేరళకు చెందిన అబ్దుల్ సలాం అల్లూరి జిల్లా అరకు నుంచి మధ్యవర్తి ద్వారా కేరళకు గంజాయితో విశాఖలోని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అనుమానస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ ఎస్.విజయకుమార్ తన సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు చెప్పడంతో సలాం నుంచి రెండు కిలోలు గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.